

భూ సమస్యలను గుర్తించేందుకు గ్రామ సభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వడ్లమూరు, నిడసనమెట్ట, గ్రామాల్లో భూ సంబంధిత సమస్యలపై రెవెన్యూ, సర్వే టీంల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో విస్తీర్ణం తక్కువ, ఎక్కువలు నమోదు, తప్పులు నమోదు, జాయింట్ ఎల్‌పిఎంలు, తదితర సమస్యలపై రైతులు భూమికి సంబంధించి దస్తావేజులతో హాజరై సమస్యలను తెలియజేయాలన్నారు. ఈ నెల 26 నుంచి డిసెంబర్ 18 వరకు ఈ టీం మెంబర్లు అంబాటులో ఉంటారన్నారు. అన్నీ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి షేక్ అబ్దుల్ కరీమ్, గ్రామ సర్వేయర్లు, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పల్లె పండుగ 2.0తో గ్రామాభివృద్ధి

- డిప్యూటీ సిఎం కె.పవన్‌కళ్యాణ్
- రాజోలు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పవన్



సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు

ప్రజాశక్తి - రాజోలు

గ్రామీణ ప్రాంతాల రూపు రేఖలు మార్చేలా పల్లె పండుగ 2.0 కార్యక్రమాన్ని రూపొందించామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. రాజోలు నియోజకవర్గంలోని శివకోటి గ్రామంలో రాష్ట్ర పల్లెపండుగ 2.0 కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ పల్లె ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, గోతులు లేని రహదారుల కల్పనే పల్లె పండుగ ప్రధాన లక్ష్యమన్నారు. రానున్న ఏడాది కాలంలో రూ.6787 కోట్లతో 8,571 కి.మీ పొడవైన కొత్తరోడ్లు, పాత రోడ్ల మరమ్మతులు, 25,000 మినీ గోకులాలు, 157 కమ్యూనిటీ గోకులాలు, 58 కి.మీ మ్యాజిక్ డ్రెయిన్లు, 15 వేల బస్ షెల్టర్లు, రచ్చబండలు, డ్రెయిన్లు వంటి ఇతరపనులను చేపడతామన్నారు. 400 గ్రామ పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వెల్ఫేర్ కార్యక్రమాలు తగ్గి యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రధాని మోడీ సారథ్యంలో, సిఎం చంద్రబాబు ఆలోచనలతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందన్నారు. కేరళ తరహాలో కోనసీమ అందమైన ప్రదేశమని, ఇక్కడ ప్రజల ఉపాధికోసం టూరిజం, సినీ పరిశ్రమలను అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కోనసీమ రైతులు కొబ్బరి చెట్టును పెద్దకొడుకులా భావించి పెంచుతారని, అది ఎన్నో ఏళ్లు ఫలాలను ఇస్తుందన్నారు. అదే మాదిరి రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వాని 15 ఏళ్లు ఆదరిస్తే వికసిత ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు. రైల్వే లైన్ పూర్తి చేయడంద్వారా కొబ్బరి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి అప్పులను వారసత్వం గా ఇచ్చిందన్నారు. రాజోలు ప్రజలు ఎప్పుడూ తన గుండెల్లో ఉంటారని, రాజోలు నియోజకవర్గం 2019లో ఇచ్చిన గెలుపే నేటి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డానికి మలుపన్నారు. కూనవరం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న శివాలయం నిర్మాణానికి సొంత నిధులతో పాటు ఎండోమెంట్ నిధులు మంజూరు చేయించి పూర్తిచేస్తానన్నారు.

కొబ్బరి రైతులకోసం త్వరలో రాజోలు మరలా వస్తా

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ప్రక్షాళన గురించి ఉన్నత స్థాయి బృందంతో ఆలోచించి మరలా త్వరలో రాజోలు వస్తానని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు. రూ.20 కోట్లతో ఉప్పునీటి నియంత్రణ చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం కోసం ఆలోచనచేయాలసివుందని అన్నారు. యువత తనకు సహకరించాలన్నారు. ప్రధానమంత్రి ఎస్‌పిజి సెక్యూరిటీ కూడా జనసేన యువశక్తికి బెంబేలెత్తుతుందని అన్నారు. సినిమా ఉపాధి అయితే రాజకీయం బాధ్యతని, సినిమాలకన్నా సమాజం పట్ల ఆసక్తి, మక్కువ ఎక్కువన్నారు.

నాయకులకన్నా ప్రజలే ముఖ్యం

రాజకీయ నాయకులను ప్రశ్నించాలంటే హక్కులతో పాటు బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని డిప్యూటీ సిఎం అన్నారు. నాయకులనన్నా వదులుకుంటానేమో కానీ ప్రేమించే ప్రజలను వదులుకోవడాని సిద్ధంగాలేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు హరీష్ మాదుర్, సానా సతీష్, ఎంఎల్‌ఎలు బొమ్మిడి నాయకర్, అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యా నందరావు, గిడ్డి సత్యనారాయణ, ఎంఎల్‌సి పేరాబత్తులు రాజశేఖర్, మాజీ ఎంఎల్‌సి రుద్రరాజు పద్మరాజు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, ఎపిడిసిఐ ఛైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, రాష్ట్ర పోలీసులు హౌసింగ్ వేర్ ఛైర్మెన్ కళ్యాణం శివ శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జెసి నిశాంతి, ఆర్‌డిఒ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్‌కు ఘనస్వాగతం

రాజోలు నియోజకవర్గం కేశనపల్లి గ్రామంలో శంకరగుప్తం మేజర్ ఉప్పునీటి డ్రెయిన్ వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలించేందుకు వచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు నియోజకవర్గ కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. గూడవల్లి హెలిపాడ్ వద్ద రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్, అమలాపురం ఎంపి హరీష్ మాదుర్, ఎంఎల్‌సి పేరాబత్తులు రాజశేఖర్, టిడిపి ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, బిసి కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, రాష్ట్ర నాయకులు గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, దిరిశాల బాలాజీ తదితరులు ఘన స్వాగతం పలికారు. కేశనపల్లి గ్రామంలో దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలించి, అక్కడ రైతులను సమస్యలను డిప్యూటీ సిఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూనవరం, చింతపల్లి గ్రామాల మీదుగా రోడ్డు మార్గంలో శివకోటి గ్రామం చేరుకుని పల్లెపండుగపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ తిలకించారు. అనంతరం పల్లె పండుగ 2.0 కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తదనంతరం బహిరంగ సభలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన పలు వినతిపత్రాలు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్, సెంట్రల్ డెల్టా ఛైర్మెన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ బందెల పద్మ, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ కేతా వెంకట లక్ష్మి, ఎంపిపిలు మేడిచర్ల సత్యవాణి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** రాజోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ శివకోడు హెలిపాడ్‌కు చేరుకున్నారు. డిప్యూటీ సిఎంకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అందజేసి స్వాగతం పలికారు డిప్యూటీ సిఎంతో ఎంఎల్‌ఎ బండారు మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. రావులపాలెం-వాడపల్లి ఎటుగట్టు రహదారికి అడగగానే రూ.6 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.. డిప్యూటీ సిఎంను వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి ఆహ్వానించామని, త్వరలో వస్తానని తెలిపినట్లు ఎంఎల్‌ఎ బండారు తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సిఐటియు, ఎఐటియుసి, రైతు ప్రజా సంఘాల నాయకులు

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ధర్నా

- పాల్గొన్న సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమలాపురం

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దేశవ్యాప్త కిసాన్ మోర్చా కేంద్ర కార్మికుల సంఘం పిలుపులో భాగంగా బుధవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ,రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎఐటియుసి నాయకులు కె.సత్తిబాబు, సిఐటియు జిల్లా కార్య దర్శి నూకల బల రాం, కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర అధ్యక్షులు కామన ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ కార్మికుల విధానాలకు వ్యతిరేకంగా వీటి ద్వారా కార్మికులకు పని గంటలను పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయకుండా కనీస వేతనాలు అడిగే హక్కు లేకుండా చేస్తోందని అన్నారు. కనీసం వారు ఐక్యంగా ఉండడం కోసం సంఘాలను కూడా ఏర్పాటు చేయకుండా అడ్డుపడుతుందని అన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచి వారి శ్రమను దోచుకోని అనారోగ్యం పాలు చేస్తుందన్నారు. రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులు మోటార్లకు మీటర్లు బిగించి స్మార్ట్ మీటర్లు పేరుతో ఆదనపు భారాలు వేస్తుందన్నారు. రైతుల నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో సంవత్సరం పాటు రైతు సంఘాల ఆధ్వర్యంలో చేసిన పోరాటాలకు తల వగ్గి ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం ఒక వరం లాగా ఉన్నంన్నారు ఈ చట్టం ద్వారా వ్యవసాయ కూలీలకు వలసల నివారించి స్థానిక గ్రామాలలో 200 రోజులు పనులు రోజు రూ.600 వేతనం ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తుందన్నారు. ఇకెవైసి పేరుతో ఉన్న జాబు కార్డులను తొలగిస్తోందన్నారు. ఉపాధి హామీ నిధులు తగ్గించి కనీసం వంద రోజులు కూడా అన్ని జాబు కార్డు ఇకెవైసి పేరు తో ఉన్న జాబు కార్డులను తొలగిస్తుందని అన్నారు. ఉపాధి హామీ నిధులు తగ్గించి కనీసం వంద రోజులు కూడా అన్ని జాబు కార్డులకు పనులు కల్పించలేదన్నారు. కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని అన్నారు. కార్డులు ఇచ్చిన ప్రతి రైతుకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. సాగు చేసిన పంటలను ఇక్రాప్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు ఇస్తేరు రాణి, సుభాషిని, ఎఐటియుసి నాయ కులు సత్తిరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షులు దైవకృప, ఎస్ఎఫ్ఐ నాని, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న వాసంశెట్టి సత్యం తదితర నాయకులు

సుందరపల్లిలో 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - కె.గంగవరం


కె.గంగవరం మండలం సుందరపల్లి గ్రామంలో బుధవారం రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, తీసుకువచ్చిన మార్పులను వివరించారు. ఇంటింటికీ వెళ్లి రైతులకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు వివరించారు. రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఇంటికి వెళ్లి సిఎం చంద్రబాబు సందేశ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైపిపి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి-మామిడికుదురు

వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య బుధవారం అన్నదానం మొగలికుదురు సత్యసాయి భరోసా దీనజనోద్ధరణ కేంద్రంలో నిర్వహించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని ఆదిత్య తెలిపారు. కార్యక్రమంలో సలాది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



నేతాజీ స్కూల్లో విజేతలకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను వివరిం చారు.
ఆలమూరు : రాజ్యాంగ దినోత్సవాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎ.రాజు ఆధ్వర్యంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎడిఎ సిహెచ్‌కెవి.చౌదరి, ఇన్‌చార్జి సబ్ రిజిస్టర్ విశ్వప్రసాద్, మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, ఎపిఎం సత్తిబాబు, ఎపిఒ అరుణ కుమారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చెముడులంక నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భగవద్గీత అధ్యాయం పై వ్యాచరచన పోటీలు నిర్వహించారు. వచ్చే నెల 13న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఏడుగురు ఎంపికైనట్లు శ్రీనివాసరావు తెలిపారు. విజేతలను పలువురు అభినందించారు. **ఉప్పలగుప్తం:** రాజ్యాంగ దినోత్సవాన్ని మండలంలోని ఆయా గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహాలకు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమాలలో సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్ర రావు,పెయ్యల రాజ్ కుమార్, మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి,దళిత నాయకులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.భానోజీరావు, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపిడిఒ వర ప్రసాద్, ఎఒ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి శివ చక్రవర్తి, వార్డు మెంబర్లు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది, అంగనవాడీ, ఆశా కార్యకర్తలు ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. **పి.గన్నవరం:** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పి.గన్నవరం రోడ్డు జంక్షన్‌లో, ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఎంఎల్‌ఎ గిడ్డి సత్యనారాయణ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండాడ నాగమణి, పి.గన్నవరం పిఎసిఎస్ అధ్యక్షులు సాధనాల శ్రీ వెంకట సత్యనారాయణ,ఎస్. శ్రీనివాసరావు, నల్లా గాయత్రి, కూటమి శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** పట్టణంలోని మోడరన్ విద్యాసంస్థల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జి.వి.రావు పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి. వెంకటేశ్వర్లు, ఎన్.ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు జి.మాణిక్యం, ఎ.శ్రీనివాస్, ఎన్.సుధాకర్, మోడరన్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు. **కొత్తపేట:** మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపిడిఒ పిఎస్.నరేష్ కుమార్ పర్యవేక్షణలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు మార్గన గంగాధరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, తదితరు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో జడ్జి మహమ్మద్ రహంతుల్లా, నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ పి.రవివర్మ, కమ్యూనిటీ ఆసుపత్రిలో డాక్టర్ వై.లోకేష్, డాక్టర్ ఎంజిఆర్ జూనియర్ కాలేజీలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కట్టా శ్రీనివాసరావు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వడ్డి నాగేశ్వరరావు తదితరులు అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జి.శ్రీనివాస సాగర్, శరత్, నిమ్మ కాయల వెంకటేష్, పి.శివ ప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న పి.గన్నవరం ఎంఎల్‌ఎ గిడ్డి



రామచంద్రపురంలో మోడరన్ విద్యాసంస్థల వద్ద ..



కొత్తపేటలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నాయకుల నివాళి



విలసవిల్లిలో చెత్త సేకరణ రిక్షాను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఊర్మిళదేవి

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామాలు పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులందరూ ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి కోరారు. మండలంలోని విలసవిల్లిలో బుధవారం తడి, పొడి చెత్త సేకరించే రిక్షాను సర్పంచ్ ఊర్మిళదేవి ప్రారంభించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి దంగేటి శివప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

విజ్ఞానయాత్రకు వల్లూరు విద్యార్థులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరు మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బొమ్మూరులోని రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం సైన్స్ సెంటర్‌కు, మండపేట మండలం కేశవరం కోకో కోలా ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న విషయాలను పరిస్థితులను స్వయంగా పరిశీలించి వాటి వివరాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. సైన్స్ సెంటర్ లోని పని అంశాలను అధ్యయనం చేశారు. కోకో కోలా ఫ్యాక్టరీ యూనిట్‌ను పరిశీలించి వాటి వివరాలను ప్రతినిధుల ద్వారా అవగాహన చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ విజ్ఞాన యాత్రలు దోహదం చేస్తాయని ఇందుకోసం విద్యా ర్థులను తీసుకువెళ్లి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోవాలి

ప్రజాశకి - అమలాపురం

మన సమాజంలో నెలకొన్న తీవ్రమైన ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, విద్య, వైద్య సదుపాయాల లేమి, దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు వీటన్నింటినీ అరికట్టాలంటే రాజ్యాంగ విలువలను రక్షించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. అమలాపురం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో బుధవారం నిర్వహించిన రాజ్యాంగ విలువలను రక్షించుకోపోతే ప్రజాస్వామ్యానికే ముప్పు కార్యక్రమలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు కారెం వెంకటేశ్వరరావు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎ.రవి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ చల్లా రవికుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రజాస్వామ్య విలువలు, హక్కులు, సాంఘిక న్యాయం, సమత వంటి విలువలను పొందుపరిచారన్నారు. మేలుకో ఆంధ్ర ప్రదేశ్ నాయకులు కెఎంఎ.సుభాష్ మాట్లాడుతూ మనం రాజ్యాంగంలో పొందుపరచుకొన్న ప్రధానాంశాలైన ప్రజాస్వామ్యం, సంక్షేమం, సమానత్వాలకు భిన్నమైన అనేక అంశాలు రాజకీయ పార్టీల ఉద్దేశాలలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో వెనకబడ్డాయని అన్నారు. రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ ఛైర్మన్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలతో మన రాజ్యాంగాన్ని రూపొందించుకొన్నామన్నారు. దానికి తగినట్లుగానే మన చట్టాలు, పరిపాలనా విధానాల రూపకల్పన జరగాలని కోరుకున్నామని అన్నారు. మానవ హక్కుల వేదిక నాయకులు వివిఎస్. కృష్ణ, ప్రముఖ నాయకులు బడుగు సుబ్బయమ్మ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సిపిఎం అనుబంధ సంఘాలు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, పిడిఎస్‌యు, అంబేద్కర్ యువజన సంఘాలు, సిపిఐ అనుబంధ సంఘాలు, బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి, మాల మహానాడు, ఎంఆర్‌పిఎస్, పిడిఎం, రాజోలు నియోజక వర్గ పరిరక్షణ చైతన్య సమితి, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్, సమతా సైనిక్ దళ్, దళిత బహుజన మహిళాశక్తి, పౌర హక్కుల సంఘం, ఎపి రైతు కూలీ సంఘం, దళిత ఐక్య పోరాట వేదిక వెంకటాయపాలెం, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, మాతా రమాబాయి చైతన్య మహిళా సంఘం, డెమోక్రటిక్ ట్రెడిషనల్ ఫిష్ వర్కర్స్ ఫోరం, రాజోలు నియోజకవర్గ ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్, రాజోలు నియోజకవర్గ ముస్లిం సంక్షేమ సంఘం, దళిత చైతన్య వేదిక, దళిత ఐక్య వేదిక, మానవ హక్కుల వేదిక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చల్లా రవికుమార్




కార్యక్రమానికి హాజరైన నాయకులు

'ది రియల్ పేరెంటింగ్ విత్ ఇన్' పుస్తక ఆవిష్కరణ

ప్రజాశక్తి - మామిడికుదురు

ఎడ్యుకేర్ విద్యాసంస్థల అధినేత కె.మొరార్జీ రచించిన 'ది రియల్ పేరెంటింగ్ విత్ ఇన్' పుస్తకాన్ని న్యూఢిల్లీలో టైమ్స్ అప్లైడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ రచయిత చేతన్ భగత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొరార్జీ విద్యాసంస్థలను స్థాపించడమే కాకుండా పిల్లలు, తల్లిదండ్రుల ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో విశ్వసనీయ స్వరం, మనస్తత్వ శాస్త్రం, ఆంగ్ల సాహిత్యం, చట్టంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలలో తన పనికి భావోద్వేగ అంతర్ దృష్టి, విద్యాలోతు ప్రత్యేకత వివరించారని అన్నారు. ఎడ్యుకేర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ల వ్యవస్థాపకునిగా రోజు వారీ కుటుంబ వాతావరణంలో పిల్లలు ఎలా ఆలోచిస్తారో, ఎలా భావిస్తారో, ఎలా పెరుగుతారో, నిశితంగా గమనించారన్నారు. ఈ పుస్తకం ద్వారా మొరార్జీ సున్నితమైన ఆచరణాత్మక మార్గదర్శకత్వం వేలాది మంది తల్లిదండ్రులకు వారి పిల్లలతో ఆరోగ్య కరమైన మరింత అర్థవంతమైన బంధాలను నిర్మించడంలో సహాయ పడుతుందని అన్నారు. మొరార్జీ తాను నేర్చుకున్న వాటిని సరళంగా, నిజాయితీగా, హృదయపూర్వకంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పంచుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ పుస్తక ఆవిష్కరణ సందర్భంగా ఎడ్యుకేర్ విద్యాసంస్థల అధినేత మురార్జీకి విద్యాసంస్థల డైరెక్టర్ కె.సత్యవాణి, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



న్యూఢిల్లీలో పుస్తక ఆవిష్కరణలో మొరార్జీ, ప్రముఖ రచయిత భగత్

నిత్యావసర సరుకుల పంపిణీ తనిఖీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరులో నిత్యావసర సరుకులు పంపిణీపై తహశీల్దార్ జి.శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి నెలా 65 సంవత్సరాలు నిండిన రేషన్ కార్డుదారులందరికీ చౌక దుకాణం డీలర్ల ద్వారా ప్రతీ నెలా 26 నుంచి 30వ తేదీ వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఈ పంపిణీ ఏ విధంగా జరుగుతుందన్న విషయమై ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కపిలేశ్వరపురం మండలంలో 65 సంవత్సరాలు పైబడిన వారికి ఉన్న రేషన్ కార్డులు 3292 కు గాను 42 చౌకధరల డీలర్ల ద్వారా ఇంటింటికి డోర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. డోర్ డెలివరీ పర్యవేక్షించేందుకు ప్రతీ దుకాణానికి ఒక్కొక్క సచివాలయ సిబ్బందిని నియమించామని ఆయన అన్నారు. 65 సంవత్సరాలు పైబడిన రేషన్ కార్డు దారులంతా ఇంటి వద్దనే ఉండాల్సిందిగా ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

తైక్వాండో పోటీల్లో జిల్లాకు ఐదు పతకాలు

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 23, 24, 25 తేదీల్లో యుపిలోని బరేలీలో జరిగిన 41వ సీనియర్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు పతకాలు సాధించారని తైక్వాండో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బి.అర్జునరావు తెలిపారు. పి.హారికరెడ్డి సిల్వర్ మెడల్ సాధించగా, వై.గంగాభవాని, జి.వంశీ, ఎల్.వెంకన్న దొర, ఎం.హర్షవర్ధన్ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఈ టోర్నమెంట్లో పి.భార్గవి కోచ్‌గా, ఆర్.మణికంఠ మేనేజర్‌గా వ్యవహరించారని తెలిపారు. సీనియర్ ఎపి టీమ్ జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం పొందినట్లు తెలిపారు. మెడల్స్ సాధించిన వారిని డిఎస్‌డిఒ సతీష్ కుమార్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వీరభద్రారెడ్డి, తైక్వాండో జిల్లా అధ్యక్షుడు జి.ఎలీషా బాబు, ఎ.మధుసూదన్ రావు, కోచ్‌లు డి.ఎస్.సత్యనారాయణ, ఎన్.తులసి, కెవి సత్యనారాయణ, ఎంపీ త్రిమూర్తులు, ఎన్.రత్న తదితరులు అభినందించారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కూటమి ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. జె.అన్నవరంలో రూ.2.65 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ముఖ ద్వారమైన జె.అన్నవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణంతో ప్రజలకు సత్వర ప్రాథమిక వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, సర్పంచ్ బాజింకల కల్యాణి, కూటమి నాయకులు మండపాక అలక్ రాజు, పసల సూరిబాబు అధికారులు ఉన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టిని అమ్మేస్తున్నారు

ప్రజాశక్తి -తాళ్లరేవు

మండలం పటవల గ్రామానికి చెందిన ఆలపాటి వెంకన్న, చింతా సముద్రం, దోణం అక్కమ్మ తదితరులకు చెందిన అసైన్డ్ భూముల్లో మట్టిని కొంతమంది అనధికారికంగా అమ్మేస్తున్నారని, ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. దీనిపై లబ్ధిదారులు భూమి వద్దకు వెళ్లగా వాళ్లను బెదిరించడమే కాక స్థానిక విఆర్ఓమ పంపిన గ్రామ సేవకులను కొంతమంది బ్రోకర్లు బెదిరించి గెంటి వేశారన్నారు. దీనిపై కోరంగి పోలీస్ స్టేషన్‌లో లబ్ధిదారులు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలూ తీసుకోలేదన్నారు. అసైన్డ్ లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్న ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ నూతన కార్యవర్గాన్ని స్థానిక అంబేద్కర్ భవనంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా దున్నా జనార్ధనరావు, అధ్యక్షునిగా వాకపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా కాశి శ్రీనివాస్, కోశాధికారిగా నాగాబత్తుల శ్రీనుబాబు, ఉపాధ్యక్షునిగా ముడుకు గోపి, జాయింట్ సెక్రెటరీగా విఆర్.నిర్మల, కార్యవర్గం సభ్యులుగా బి.ఝాన్సీ, పులపకూర శ్రీనివాస్, సోషల్ మీడియా గిడ్డి రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుత్తాల సుబ్రహ్మణ్యం, మరో ఐదు మంది స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, బిక్కవోలు

ఉండ్రాజవరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్టి మహోత్సవం ఘనంగా ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో షష్టి మహోత్సవంలో ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, ఎంఎల్‌సి సోము వీర్రాజు, ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పుట్టినరోజు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ బండారులంక గ్రామ దేవాంగ సంఘం అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, అమలాపురం మాజీ మండలాధ్యక్షుడు పుటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పుట్టినరోజు వేడుకలు బుధవారం బండారులంకలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చెల్లబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర, గోవ్వాల రాజేష్, పిచ్చిక శ్యామ్, చింతపట్ల గంగా సత్యనారాయణ, కాలెపు శ్రీనివాసరావు, దంగేటి సత్తిబాబు, ఉనుమర్తి లింగమూర్తి, బాబూరావు, అంకం పెదరాజు, కార్యూనిస్ట్ మాదా రాము తదితరులు పాల్గొని సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బండారులంక కు చెందిన సీనియర్, సహజ చిత్రకారుడు ఉత్కం బాపుజీ చిత్రించిన నీటి రంగుల పూలకుండీ పొట్రైట్‌ను ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బహూకరించారు.



దాతకు స్వామివారి చిత్రపటం అందజేత

నిత్యాన్నదానానికి రూ.20 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

బెంగళూరుకు చెందిన పోతుకూచి కామేశ్వరి మాధవ్ సబిత దంపతులు, నవదీప జోషి దంపతులు, అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ 20,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం. సత్యనారాయణ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శ్రీ స్వామివారి చిత్రపటమును అందజేసినారు.

ఘనంగా షష్టి ఉత్సవాలు

ప్రజాశక్తి-మామిడికుదురు



బి.దొడ్డవరం, పెదపట్నం, పాశర్లపూడి బాడవ, అప్పనపల్లి, మామిడికుదురు, పాశర్లపూడిలంక తదితర గ్రామాల్లో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయా ల్లో షష్టి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బి.దొడ్డవరం లో బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి సర్పంచ్ చెల్లిబోయిన రామ శివ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాల కావిళ్ళతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పాల బిందెలతో, పురుషులు పాలకావిళ్లతో నిర్వహించిన గ్రామోత్సవం యాత్రికులను ఆకట్టుకుంది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. **ఆలమూరు:** మండలంలోని చెముడులంకలో వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దీంతో వివిధ గ్రామాల నుంచి యాత్రికులు స్వామి దర్శనార్థం పోటెత్తారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'రాజీనామాలన్నీ డ్రామాలే'

ప్రజాశక్తి - రామచంద్రపురం

వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరిన వారి మాటలన్నీ డ్రామాలేనని వైసిపి నాయకులు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ముగిసిన రోజు నుంచి ఇప్పటి వరకు పార్టీ కార్యకలాపాల్లో ఒక్కరోజైనా వారు కనిపించలేదన్నారు. పార్టీ సమావేశాలకు రాలేదన్నారు. ఏ కార్యక్రమానికీ హాజరు కాలేదన్నారు. ఇప్పుడు వచ్చి రాజీనామా చేస్తున్నాం అని చెప్పడం కేవలం ఒక డ్రామా మాత్రమే అని కె.గంగవరం మండలం నాయకులు వివరించారు. అధికార దాహం కోసం మీరు వైసిపి రామచంద్రపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి సూర్య ప్రకాష్‌ను, పార్టీని గానీ విమర్శించే ప్రయత్నం చేస్తే సహించబోమన్నారు. సమావేశం కె.గంగవరం మండలం కన్వీనర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచులు పంపన సత్యానందం, చిల్లి నాగేశ్వరరావు, మల్లిడి వెంకట్రావు, తోకల శ్రీను, అలాగే బత్తుల అప్పారావు, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం,మేడిశెట్టి గోవిందు, చిట్టూరి శ్రీనివాస్, చిట్టూరి భద్రం, జంగం సత్తిబాబు, వెంటపల్లి నాని,పిల్లి కష్ణ వెంకటేష్, వల్లు శ్రీను పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

రాజకీయాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని సామర్లకోట మున్సిపల్ ఛైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. 6 వార్డులో కమ్యూనిటీ హాలు భవనానికి సంబంధించి రూ.6 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణానికి ఛైర్‌పర్సన్ అరుణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇంకా అనేక అభివృద్ధి పనులు రానున్న రోజుల్లో ప్రారంభం కానున్నట్టు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజస్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, టిడిపి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, బలుసు వాసు, తాతపూడి కృష్ణబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, గొల్తి సత్యనారాయణ, నిమ్మకాయల కిరణ్ కుమార్, జనసేన నాయకులు సరోజ వాసు, మంచెం సాయిబాబు, పిట్టా జానకి రామారావు, తుమ్మల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు రుణ సదుపాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

టిడ్కో గృహ సముదాయంలో రుణ ప్రక్రియ పూర్తిగా కాకుండా మిగిలిపోయిన సుమారు 300 మంది టిడ్కో గృహ లబ్ధిదారులకు ఈజీ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాజమండ్రి బ్రాంచ్ ద్వారా రుణ సదుపాయం కల్పించబడుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిఎంఎం జి.భ్రమరాంబ అధ్యక్షతన టిడ్కో గృహ లబ్ధిదారులు, మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రుణ సదుపాయం ప్రక్రియ పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు ఇళ్లను అప్పగిస్తామన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈజీ హోమ్ ఫైనాన్స్ టీమ్ ఆపరేషన్ హెడ్ ఎ.ప్రసాద్ మాట్లాడారు. ఈ సమావేశంలో బ్రాంచ్ డిఆర్ఎం ఎం.దివాకర్, ఎఎస్ఎం పి.శివగోపాలకృష్ణ, ఎఒ ప్రసాద్, సి.ధర్మారావు, మెప్మా సిఒ శ్రీదేవి, నర్గీస్, ఆర్‌పిలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఇంటి పన్నుల వసూళ్లపై మండలంలో అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బుధవారం మండలంలోని చెందుర్తిలో ఎంపిడిఒ ఎన్.సెలెట్ రాజు ఇంటి పన్నుల స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఇంటింటా పర్యటిస్తూ పన్నులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సెలెట్ రాజు మాట్లాడుతూ గ్రామంలో మెరుగైన సౌకర్యాలు అందించడానికి పంచాయతీకి రావాల్సిన రెవెన్యూ బిల్లులు త్వరితగతిన చెల్లించాలన్నారు. ఇఒపిఆర్‌డి వి.సాగర్ కుమార్, పంచాయతీ సర్పంచ్ అల్లిపాప నూకరాజు, ఉప సర్పంచ్ కోనేటి సుధ, పెదకాపు సెక్రటరీ గంగాధర్ పాల్గొన్నారు.

రోగులకు శ్రీనివాసరావు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కరప

కరప గ్రామానికి చెందిన పలువురు రోగులకు రిటైర్డ్ చీఫ్ లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు బుధవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తికి స్పందించిన ఆయన, అకాల మరణం, పాము కాటు, రక్తహీనత, బ్రెయిన్ బ్లడ్ క్లాట్, పెరాలసిస్ వంటి సమస్యలతో బాధపడుతున్న ఆరుగురికి మొత్తం రూ.35 వేల సాయం అందజేశారు. సాయం చేసిన శ్రీనివాసరావుకు గ్రామ ప్రజలు, కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

30 వరకూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని రేషన్ కార్డుదారులు నవంబరు నెలాఖరులోగా తమ స్మార్ట్ రేషన్ కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొత్తం 5,59,348 స్మార్ట్ రైస్ కార్డులు ముద్రించి పంపిణీకి ప్రభుత్వం పంపిందని చెప్పారు. ఇప్పటి వరకు 5,30,241 కార్డుదారులకు కార్డులు అందజేశామన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

భారత రాజ్యాంగ 75వ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. యానాం ఎస్‌సి, ఎస్‌టి ఫోరం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, దాట్ల దేవదానంరాజు, నామాడి అప్పారావు, గిడ్డి బలరామ్, తిరుకోటి నాగేశ్వరరావు, పండు సిద్దార్థ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బుద్ధా పార్కు ఆవరణలో రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ఫోరం అధ్యక్షుడు, జనమిత్ర సంపాదకులు పొనుగుమట్ల విష్ణుమూర్తి మాట్లాడుతూ భిన్న మతాలు, సంస్కృతులు గల దేశానికి అంబేద్కర్ సమున్నతమైన రాజ్యాంగంను అందించారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాస్తోందన్నారు. ప్రజలకు అనేక హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు, విశ్రాంత పరిపాలనాధికారి గిడ్డి బలరామ్ మాట్లాడారు. పొలమూరి సత్యనారాయణ, గుర్రపు ప్రహ్లాదుడు, ఇసుకపట్ల పాపారావు, కోరుకొండ రాజేంద్రప్రసాద్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయం సిబ్బంది, పలువురు అధికారులతో పరిపాలనాధికారి అంకిత్ కుమార్ ఈ ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునరావు, విద్యుత్ శాఖ ఎఇ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను నిరసిస్తూ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - యానాం

కేంద్రం బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకురావడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం యానాం పాత బస్టాండ్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. లేబర్ కోడ్స్ జిఒ కాపీను దహంన చేశారు. తొలుత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుంచే సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, తిరుకోటి శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, కె.మధుబాబు, బి.సత్యనారాయణ, గిడ్ల ఏసుబాబు, శ్రీనివాసరావు, ధర్మారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు బందం సంఘీభావం తెలిపారు.

ఎలక్టోరల్ మ్యాపింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో బిఎల్‌ఒలకు 2002-2025 ఎలక్టోరల్ మ్యాపింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా విఎల్‌ఒలకు మ్యాపింగ్ విధానంపై శిక్షణ ఇచ్చి నిర్ణీత సమయంలో మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

ప్రజాశక్తి-పెదపూడి

కరకుదురుకు చెందిన సేవాకీయం ట్రస్ట్ అధినేత తలాటం మురళీకృష్ణ, శిరీష దంపతులు బుధవారం అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ప్రతి ఏడాదీ స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉండ్రు చంద్రకళ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ ఉండ్రు సత్యనారాయణ, ట్రస్ట్ వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు, సింగిడి నాగతిరుపతిరావు, సానా శ్రీను, పాటంశెట్టి కాశిరాణి పాల్గొన్నారు.

కళా, సాంస్కృతిక వైభవాన్ని తీసుకొస్తాం -మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు సమగ్ర స్వరూపాన్ని మార్చి కళా, సాంస్కృతిక వైభవాన్ని తీసుకొస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో నిడదవోలు మున్సిపాలిటీ వజ్రోత్సవ వేడుకల్లో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం రూ. 80 లక్షల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పాటై 60 వసంతాలు గడిచిన సందర్భంగా వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవడం ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాల గురించి, నిడదవోలు పట్టణాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల గురించి కౌన్సిల్ సమా వేశాల్లో చర్చించుకోవాలని పురపాలక సంఘానికి సూచించారు. మంత్రి దుర్గేష్ సహకారంతో నిడదవోలు పట్టణం పురోభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కందులు పాలెం గ్రామం లో బీమాభాయ్ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళ హింసకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీమాభాయ్ మహిళా మండలి మండల కోఆర్డినేటర్ డి.అర్జున్ రావు మాట్లాడుతూ మహిళలకు, బాలికలకు వారికి కల్పించిన చట్టాల గురించి తెలుసుకోవాలని ప్రతి ఒక్కరు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎం.నూకలక్ష్మీ అనిత, జి.చంద్రకళ , మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కొత్తపేట

బిల్లకుర్రు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గురువారం 33 కెవి ముక్కామల ఫీడర్ నందు ఆర్‌డిటిఎస్ స్కీంలో భా గంగా కవర్డ్ కండక్టర్ రీప్లేస్మెంట్ పని నిమిత్తం అవిడి గ్రామానికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి కోర్టు ఫీడర్ లైన్ షిఫ్టింగ్ వర్క్ కామ్మిరెడ్డి పాలెం వాడపాలెం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యు త్ సరఫరాలోఅంతరాయం కలుగుతుందని అన్నారు.

వినియోగాదారుల సహ కరించాలని కోరారు

గోవిందపురంలో సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గోవిందపురంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కమ్మిల వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంఎల్‌ఎ మాట్లాడారు. సామాన్యులకు రాజ్యాధికారం అందించిన రోజున గ్రామీణ సేవలకు సచివాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం గోవిందపురం అనువంశిక ఆయుర్వేద వైద్యులు రవి వర్మను, ఎంఎల్‌ఎను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ అడపా భరత్, ఎంపిటిసి జానకి వరలక్ష్మి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన రైతు కరాటం ప్రవీణ్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రాజోలు పర్యటన నేపథ్యంలో స్థానిక రైతు కరాటం ప్రవీణ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరు వల్ల రాజోలు నియోజకవర్గ పరిసర ప్రాంతాలలో ఉన్న నష్టపోయిన కొబ్బరి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక రైతు ఆంధ్ర సేవారత్న కరాటం ప్రవీణ్ కోరారు. ఎన్నో ఏళ్లుగా పరిసర ప్రాంతాలలో తమకున్న భూములు, కొబ్బరి చెట్లు మాడిపోయి ఆర్థికంగా నష్టపోయామని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉప్పుటేరు నిర్మూలనకు కృషి చేసి స్థానిక రైతులకు ఆర్థిక సహాయం అందజేయాలని పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సిఎంను కోరారు. ఈ కార్యక్రమం లో సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

వచ్చే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం సాయంత్రం సబ్ కోర్టులో న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ కేసులు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, భార్య భర్తల వివాదాల కేసులు పరిష్కారం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కిర్లంపూడి, జగ్గంపేట మండలాల్లో బుధవారం పలు చోట్ల యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు కుమారుడు సుధీర్ బాబు 36వ జయంతి పురస్కరించుకుని ఆయన మిత్రులు జగ్గంపేటలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద యాత్రికులకు పులిహోర, చక్రపొంగలి, వాటర్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో టిడిపి నాయకులు బొదిరెడ్ల సుబ్బారావు సహకారంతో యాత్రికులకు అల్పాహారం, మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ వైబోగుల కొండబాబు, టిడిపి నాయకులు సాంబబత్తుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం.17867/1997-జి1 **తేది.22-11-2025**

ప్రకటన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల దానవాయిపేట లే-అవుటు నందలి స్థలములకు చేర్చి ఉన్న కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు స్థల యజమానులు ఆక్రమించుకొని నిర్మాణములు చేసుకొనియున్నారు. సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలముల యొక్క ఆవశ్యకత ప్రస్తుతము లేనందున సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు అనగా కన్సర్వేన్సీ లేన్ స్థలముల ఆక్రమణదారులకు విక్రయించుటకు తీర్మానము నెం. 03/471/2011, తేది.30-04-2011 నందు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించినారు. సదరు విషయమై ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 488, తేది.11-12-2013 నందు దానవాయిపేట నందలి కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారిని అనుమతించియున్నారు. శ్రీయుత జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు చదరపు గజము ఒక్కింటికీ నిర్ణయించు ధరకు లోబడి దానవాయిపేట కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు గాను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించియున్నారు.

ఇందుపై సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలములను గుర్తించి సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొనవలసినదిగా ఈ కార్యాలయము వారిచే నోటీసులు జారీ చేయడమైనది.

ఇందుపై ఈ క్రింది తెలిపిన మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులు కొనుగోలు చేయుటకు ఆసక్తి వ్యక్తపరచి దరఖాస్తులు దాఖలు చేసియున్నారు.

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ మరియు డోర్ నెంబర్	దరఖాస్తుదారు పేరు (కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చియున్న స్థల యజమాని)	కన్సర్వేన్సీ లేన్ స్థల విస్తీర్ణము	కన్సర్వేన్సీ లేన్ స్థలమునకు సరిహద్దులు
1	తలుపు నెంబరు 46-01-14, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 6, టి.ఎస్. నెం. 370/P, 377/P, & 378/P, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి నజ్మా షరీఫ్, భర్త: ఎమ్.డి.హుస్సైన్ షరీఫ్	91.46 చ॥గ॥లు (13'-0" X (62'-11" + 63'-10")/2) 76.47 చ॥మీ॥	తూర్పు: టి.ఎస్.నెం.378/పి - 63'-10" పడమర: దరఖాస్తుదారుని స్థలము, టి.ఎస్.నెం. 370/పి - 62'-11" ఉత్తరము: రోడ్డు - 13'-0" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 377/పి - 13'-0"
2	తలుపు నెంబరు 46-04-5B/1, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 1, టి.ఎస్. నెం. 251/P, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి పి.నాగమణి, భర్త: పి.కోటేశ్వరరావు	10.32 చ॥గ॥లు 7'-7" X 12'-3" 8.62 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.251/పి - 12'-3" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 250/పి - 12'-3" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 250/పి - 7'-7" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 250/పి - 7'-7"

కావున పైన పొందుపరచిన కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులకు విక్రయించుటకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు (7) రోజుల్లోపు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం